

జీవితం

[కథానిక]

చేత్తో లెదర్ సూటుకేసు పట్టుకొని, ప్లాటుఫారం మీద యిటూ అటూ తిరుగుతున్నాడు వెంకట్రావు. అతనికి వెనకనుంచి ఎవరో పిలిచినట్లయింది. తిరిగి చూశాడు — కుటుంబయ్యగారు!

"ఏమండోయ్ కుటుంబయ్యగారూ, యిలా..." వాక్యం పూర్తిచేయకుండా ఆపేశాడు, కుటుంబయ్య ప్రక్కన మెరుస్తో నించొనిఉన్న పద్ధెనిమిదేళ్ల అమ్మాయిని చూసి. "తిరిగి కుటుంబయ్య పెళ్లిచేసుకోలేదు కదా!"

రావుఆశ్చర్యం గమనించి కుటుంబయ్య యిలా అన్నాడు: "దీన్ని మరచిపోయావుటోయ్! అవునులే, మనం ఆరేళ్లయింది కల్సుగుని. చిన్నతనంలో యిద్దరూ ఆడుకునేవారు కూడాను" ఇంతకీ ఎవరో చెప్పలేదు రావుకి. ఆ అమ్మాయి నవ్వుతో "మీరు గుర్తించలేనంతగా మారిపోయానా రావుగారూ" అంది. ఏమనాలో తెలియక డెలికేట్‌గా ఫీలయ్యాడు వెంకట్రావు.

"అమ్మాయి చదువుకుంటోంది. ఈయేడాది బి. యే. జూనియర్ అయింది. సంగీతంలోనూ, పెయింటింగులోనూ అభిరుచి వుంది. అయితే, యింజనీరుపరీక్ష ప్యాసై, అప్పుడే ఉద్యోగంలోకూడా ప్రవేశించావుటకదూ? ఇలా ఎక్కడికి వెళుతున్నావు, కాకినాడేనా! సగంవరకూ మేమూ వస్తాంలే! చాలా ఆనందంగా వుంది నాయనా నిన్ను చూడటం. తెలివి తేటలైనవాడవు, యింతకీ... అన్నట్టు, అమ్మాయీ, వాళ్లమ్మా మనింట్లోనే ఉంటున్నారు. ఓహో, నీకు తెలియదుకాబోలు, అమ్మాయిఫాదరు పోయాడని. నాకూ జవసత్వాలు తగ్గినై. ప్రాక్టీసూలేదూ, మరోహాబీ లేదు..." పొడిదగ్గు వచ్చి కుటుంబయ్యగారి వాక్ప్రవాహానికి అడ్డువేసింది. ప్రక్కనే, ఆ అమ్మాయి నవ్వుతో నించొంది.

ఇంతకీ ఆమె ఎవరో తెలియక తికమక పడుతున్నాడు రావు. తప్పనిసరిగా చిరునవ్వు తెప్పించుకొని "అలాగాండి" అన్నాడు. దూరంగా పొగలు చిమ్ముకుంటూ వస్తూన్న రైలుని చూస్తోన్న ఆమె విలాససంపదని చూసి విభ్రమం చెందాడు.

రైలు వేగంగా వెళ్తోంది. గాలికి ఎగిరే ముంగురుల్ని పైకి తోసుకుంటూ, ఆకర్షించే అందమైన నవ్వుతో, ఆమె రావుతో మాట్లాడుతోంది: "నాకు సంగీతమన్నా, పెయింటింగు అన్నా చాలా యిష్టమండీ. నేను చిత్రించిన సంధ్యాసుందరి క్రితం నెల '...' పత్రికలో పడింది చూశారా! జీవితాన్ని ఏదో కొంత ఉపయోగకరం చేద్దామని నాకోరిక. సంగీతం అన్నా రా, అబ్బ, వీణలో అనుకున్నంత ప్రవీ

శ్రీ
బాలగంగాధర తిలక్

ణత సంపాదించలేదండీ. మంచిగాలివేస్తోంది, హాయిగా ఉందికదండీ."

ఆమె ఉత్సాహమూ, అమాయకత్వమూ వెంకట్రావుని బాగా touch చేసినై. ఆమె నవ్వుతూన్నంత సేపూ తెలీకుండా తనూ నవ్వాడు. కుటుంబయ్య కునుకుపాట్లు పడుతో ఉలిక్కిపడి లేచి "అమ్మాయి, స్టేషను వచ్చిందా ?" అన్నాడు. "అప్పుడే ఏం స్టేషనూ!" అంది ఆమె. కుటుంబయ్య దగ్గు దగ్గి (ఉపన్యాసానికి సూచన) మొదలెట్టాడు:

"ఎప్పుడేనా వస్తోండవోయ్ మావూరు. మావంతెన రిపెయిర్ చేయిస్తా మంటున్నారు. మావూరు నీ జ్యూరిస్‌డిక్షను క్రిందకే వస్తుందా? వెనవవూరు, దోమ లెక్కువ... అన్నట్టు మీవూళ్లో దోమ లున్నాయా ... మున్సిపాలిటీ ఏం శ్రద్ధ తీసుకోదు కదా! నా కిప్పిస్తే చేర్మెనుపని ... రావు! యీ నటికి నేను కోర్టుకి వెళ్లితే, ఒక్కలాయరూ ఎదురుగ నిల్చొని వాదించలేడనుకో. మేం యిప్పటి వాళ్లమా! మేం వోట్లు బియ్యేలం. అమ్మాయి చదువులా, ఫ్యాషనులా? ... అమ్మాయి వీణ మహాచక్కగా వాయిస్తుంది. భోజనం అవగానే అమ్మాయిపాట వింటేనే గాని నిద్రపట్టదుకదా! అసలు ఆరోగ్యం పోయిందిలే, డాక్టరుని మంచి టానిక్ యిమ్మనాలి ..."

ఒక విషయంలోంచి మరొకదాంట్లోకి దూకుతూన్న యీ ముసలిప్లీడరు ఉపన్యాసాన్ని "ఓహో, అలాగా" అంటూ కడదాకా విన్నాడు వెంకట్రావు. చివరికి స్టేషనువచ్చింది. కుటుంబయ్య, ఆమే లేచారు. "నేను వెళ్లివస్తానండీ,...మీ రింకా నన్ను గుర్తు పట్టలేదు." అంటూ ఫక్కున నవ్వింది. ఆక్వర్డుగా ఫీలయాడు వెంకట్రావు. "గుడ్ యీవినింగ్, నేను నిర్మలని" అంటూ ఆమె కుటుంబయ్యతో, రైలు దిగి మాయమైపోయింది.

స్టన్ (Stun) అయిపోయాడు రావు. నిర్మల—కుటుంబయ్య మేనకోడలు నిర్మల! ఎంత మనిషి అయిందీ, ఎంత అందమైనదీ, ఆరేళ్లలో ఎంతగా ఎదిగిందీ, గుబురుగా పెరిగిన మొగలివనంలాగ. ఆ నవ్వు, కళ్లల్లో ఆ తెలివితేటలు... తను మరచిపోగలడా? ఇలా ఆలోచించుకుంటూ తలెత్తాడు. ఎదురుగా ఒక కోమటీ, విధవా కూర్చున్నారు...

౨

"హలో, బ్రహ్మచారి" అని పలకరించాడు శంకరం, వెంకట్రావుని. 'బ్రహ్మచారి' అనేపదం గాలిలో మెలికలు తిరిగి ములుకులా గుచ్చుకొంది రావుహృదయంలో. పార్కునుంచి వస్తోంటే పైపెచ్చు శంకరం ఇలా అన్నాడు: "ప్రేమ—ప్రేమ లేందీ బ్రదుకేమిటిరా! ఆఫీసునుంచి యింటికి వెళ్లగానే, నవ్వుతో ఎదురై, ఆదరించే ఆడది లేకపోతే ఆజీవితం నరకం. ప్రేమలో ఎంత హాయి, ఆనందం, చైతన్యం ఉందిరా..."

"నిజమే! తను ఎవరినేనా ప్రేమించాడా? తనకి వివాహమాడే వయస్సు దాటిపోయిందేమో కూడా! ఆ ప్రేమానుభవం ఎలా వుంటుంది? హాల్‌కెయిన్, మొపాసా, సింక్లార్ మొదలైనవాళ్ల నవలలు చదివాడు. అంతే! ఒక స్త్రీకీ పురుషుడికీ మధ్య యింత ఆకర్షణ, యింత రొమాన్సు దేవు డెందుకు పెట్టాడు. హత్య, త్యాగం, ఆనందం... చివరికి జీవితం ప్రేమకోసమా! అంత ముఖ్యమా ప్రేమ...

"తన జీవితం చాలా చిత్రమైనది. కాలేజీలో చేరిన రెండేళ్లల్లో తల్లీ తండ్రీ చనిపోయారు, అప్పు మాత్రం మిగిల్చి. చదువు మానేసి ఏనౌకరీనో చేద్దామనుకుంటూంటే, మేనత్త— ఆ మేనత్తయింటికి తనెప్పుడూ వెళ్లలేదు. ఆవిడే ఒకటిరెండు సార్లు తన యింటికి వచ్చింది— చచ్చిపోతూ పాతిక ఎకరాలు తనకి రాసియిచ్చింది. అదృష్టం. అదృష్టం కాకపోతే, పరీక్ష ప్యాసవగానే వందరూపాయల ఉద్యోగం రావట మేమిటి, పై అధికారులచేత మెప్పు పొందట మేమిటి, అన్నిటికన్నా రైలులో ఆమెని— నిర్మలని కల్సుకోవట మేమిటి. నెల్లాళ్లయింది ఆ అమ్మాయిని చూసి. అప్పట్నుంచీ మనస్సే అదోవిధంగా అయిపోయింది."

ఇలా ఆలోచించుకుంటూ, తన బంగాళాలోకి వెళ్లి కూర్చున్నాడు. నౌకరు వచ్చి, అతని బూట్సు విప్పి, రోజూ అనే మాట యీవాళా అన్నాడు: "బాబుగారు అలసిపోయారు." రాత్రి పడుకోబోయే ముందు కన్నయ్య నిలా అడిగాడు: "ఒరేయ్ ప్రేమంటే ఏమిటో తెల్సునురా." చాలాఅనుభవం ఉన్నవాడిలా, చిరునవ్వు నల్లని పెదవులమీదకు రప్పించి "ఆడదాని

మీద మనసు అవటం" అన్నాడు వాడు. మరి శబ్దరత్నాకరంలో ఏం రాశారో!

ఉదయం లేచి, డ్రస్సు వేసుకొని కూర్చున్నాడు, వెంకట్రావు. కారు ఆగినచప్పుడయింది. వెంకట్రావు వీధిలోకి ఒక్క గెంతేశాడు. కారులోంచి డిస్ట్రిక్టు యింజనీరు రాఘవరావు దిగాడు. వినయంగా ఆయన్ని ఆహ్వానించాడు రావు.

"నీ శ్రద్ధా, తెలివితేటలూ మెచ్చుకోదగినవోయ్. నేను నీ విషయంలో ప్రత్యేకంగా ఆదరం చూపిస్తాను." అని కాంప్లిమెంటు యిచ్చాడు రాఘవరావు, మీసాల చాటున చిరునవ్వు దాచుకొని. "నర్సాపురం వంతెన రిపెయిర్ చేయించాలి. నీకే ఆ పని యిద్దామనుకొంటున్నాను. నువ్వు అనుభవం సంపాదించాలి. కంట్రాక్టర్లకి లొంగిపోగూడదు సుమీ. అన్నట్టు — మీ పేటలో శీతమ్మ మాంచి నెయ్యిపోయిస్తుందిటకదూ, రెండు వీసెలు మనకి పంపించు" అని పర్సుతీయబోయాడు. వెంకట్రావు ఆయన్ని వారించి, "ఎంతమాట, తర్వాత యిద్దురుగాని లెండి. సాయంత్రానికి పంపిస్తాను నెయ్యి" అన్నాడు.

ఆయన్ని సాగనంపి, మహానందంతో కుర్చీలో ఒక్క గెంతేసి కూర్చున్నాడు. 'ఏక బంగళా బనే న్యారా' అనే పాటని వెయ్యివరసల్లో పాడుతూ, గదిచుట్టూ తిరిగాడు. చాలా శాంతంగా, నెమ్మదిగా ఉండే యజమానికీ వెర్రి ఆవేశం ఎందుకో తెలియక "బాబుగారు చాలా అలసిపోనూరు." అన్నాడు కన్నయ్య.

వారంరోజుల్లో ఆర్డరు వచ్చింది. హోల్డాల్, పెట్టె, కన్నయ్యా తోడురా నర్సాపురం బయల్దేరాడు రావు.

3

నర్సాపురం వచ్చి రెండురోజులైనా, కుటుంబయ్యగారి యింటికి వెళ్లేందుకు తీరిక లేకపోయింది రావుకి. అందుకని, కుటుంబయ్యగారే వచ్చి రావుని ఆహ్వానించి తీసుకువెళ్లాడు. కుటుంబయ్య చెల్లెలు చాలా ఆదరించింది రావుని. కన్నయ్య నిర్మలకేసీ, రావుకేసీ ఎగాదిగా చూసి "చిలకా గోరింకల్లా ఉన్నారు" అనుకొన్నాడు. నిర్మల తనవైపు తిరిగి మాట్లాడినపుడల్లా చొక్కా నలిగిపోయిందేమోననీ, జుట్టు చెదరిపోయిందేమోననీ అనుమానంతో బాధపడి ఒంటరిగా అద్దంలో చూసుకొని సంతృప్తిపడేవాడు రావు.

భోజనాలయాక కుటుంబయ్య నిర్మలని పాడమన్నాడు. "ఇంజనీరుగారు వింటారు పాడవే" అంది లక్ష్మమ్మ. లక్ష్మమ్మ కుటుంబయ్య చెల్లెలు, అందమైనదీ, చదువుకొన్నదీ. భర్తపోయినప్పట్నుంచీ అన్నగారివద్దనే ఉంటోంది. "అచ్చంగా తల్లిపోలిక నిర్మల." అనుకున్నాడు రావు.

నిర్మల వీణను సున్నితంగా సుకుమారంగా మీటుతూ, కోకిలగొంతుతో పాడుతూంటే మరో ప్రపంచంలోకి వెళ్లిపోయాడు రావు. ఆ మెకళ్ల కదలికా, పెదవుల వంపూ, నాజూకైన దేహమూ అతనికి ఒక సౌందర్యరేఖగా, ఆలేఖ్యంగా కనపడింది.

"అమ్మాయిని రేడియోవారు రమ్మన్నారు. బహుశా ముందునెలలో ప్రోగ్రాం వుంటుంది." అంది లక్ష్మమ్మ.

"ఎలావుంది పాట" అంది, వీణ క్రిందబెట్టుతూ నిర్మల. అంతవరకూ ఆమెవైపే చూస్తోన్న కళ్లని మరల్చి, ఉలిక్కిపడినట్లుగా, "బావుంది, బావుంది" అన్నాడు. లక్ష్మమ్మ అతని రహస్యాన్ని గ్రహించింది.

ఎలా బయలుదేరిందో తెలియదుగాని, శరచ్చంద్రుని నవలలగురించి వాదనలోకి దిగారు రావూ, నిర్మలా. "ఆ ట్రాజెడీలు నాకు నచ్చవు.—ఉహుఁ! అంత నిర్దయగా చంపేస్తాడు." అంది నిర్మల. "లేకపోతే **Purpose** ఎలా నెరవేరుతుందీ! నిర్మలమైన ప్రేమ ఉన్నపుడు" అన్నాడు రావు. "ప్రేమ ఉంటేమాత్రం—దేవదాసులాంటి ఆవేశపరులూ, ఉన్మాదులూ దేశానికెందుకండీ. ఆడదే జీవితంటండీ. కళ ఉంది, సంఘం ఉంది. ఏదో ఒకపనిలో నిమగ్నులవాలి, లేకపోతే తిని కూర్చోవాలి." అంది ఆవిడ. "మరి అది ప్రేమట. ప్రేమించి విఫలులైనవాళ్లు అలా అవుతారేమో మరి! నాకేం తెల్సును." అన్నాడు రావు ఆలోచిస్తూ. "మీ రెవర్నీ ప్రేమించలేదూ? అదేమిటండీ." అంటూ కిలకిల నవ్వుతూ, వీణతో, లోపలికి పారిపోయింది నిర్మల.

తను ప్రేమించాడా! పాతికేళ్లువచ్చినా ఆ ప్రేమ తన కొక స్వప్నభావమే కాని వాస్తవికంగా అనుభవిం

చూడా. అందరూ ప్రేమిస్తారు, తనొక్కడే యిలా అయిపోయాడు. ఈ సందేహాలు రావులో ఆలోచన రేపినై. కుటుంబయ్య యీజీచైరులోనే కునుకుపాట్లు పడుతున్నాడు. లక్ష్మమ్మ తనపూర్ణయాత్ర అనుభవాలు చెపుతూ యిలా అంది: "ఇంగ్లీషు రాకపోయినా, తెలుగుపత్రికలూ, పుస్తకాలూ నేనూ చదువుతోంటాను నాయనా. స్త్రీకి స్వతంత్రమూ, విద్యా వుండాలని నా ఉద్దేశ్యం. మానిర్మలని చూశావా. అన్నీ చదువుతుంది, వాదిస్తుంది, తెల్సుకొంటుంది. కాలేజీలో కూడా మాట్లాడిందట...ఏదో దానిమీద ఆశ పెట్టుకొని ఉన్నాను. ఈ సెలవు లయాక మద్రాసు వెళ్లుతుంది. ఈ యేడాదితో బి. యే. పూర్తి అవుతుంది. అంతవరకూ దాని పెళ్లిమాట తలపెట్ట దలచుకోలేదు. కట్నాలూ, గిట్నాలూ ఏం యివ్వలేంసుమీ. దాన్ని చూసి చేసుకో వలిసిందే...ఇంతకీ ఆ యీశ్వరుడున్నాడు."

ఆవిడదగ్గర్నుంచి సెలవు తీసుకొని, అర్థమవని భావాలు మనస్సులో కలవరపరుస్తూండగా, తిన్నగా లాడ్జికి వెళ్లాడు రావు. ఇంతలోకీ కంట్రాక్టరు చౌదరి వచ్చి వంతెనదగ్గరకు తీసుకువెళ్లాడు, ఆలోచించేందుకు తీరిక యివ్వకుండా. చీకటిపడ్డాక తిరిగి వస్తోంటే, చౌదరి ఆ వూరినిగురించి విసుగెత్తేట్టు పొగిడాడు. ఒకపాడుకొంపను చూపించి, దానిచరిత్ర, పరమార్థమూ చెప్పి యిలా అన్నాడు: "రాత్రుళ్లు దెయ్యాలు కొరకంచులు చేతులతో పట్టుకొని యీ కొంపలో తిరుగుతోంటాయి. ఆమధ్య ఒకపిల్లాడు పొరుగూరినుంచి వస్తోంటే, దెయ్యాలు దారి తప్పించి చంపేశాయి. ఉదయానికి ఎముకలుమాత్రం మిగిల్చాయి."

వెంకట్రావుకి దెయ్యా లున్నవనే నమ్మకం లేకపోయినా, భయం ఎక్కువ. ఆప్రసంగాన్ని మరొకదాంట్లోకి మార్చేశాడు. విద్యాధికులకి అంతే-దెయ్యాలని నమ్మరుకాని, పిరికితనం!

బంగాళాకి వెళ్లగానే "బాబుగా రలసిపోయారు" అంటూ కన్నయ్య ఎదురయ్యాడు. రావు అతన్ని పరికీలించకుండా, గదిలోకి వెళ్లి మంచంమీద పడుకొన్నాడు. తల దిమ్మగా వుంది. ఆనందమో ఏడుపో – ఏదో గుండెలో గుసగుసలాడుతోంది. తను అలవాటుపడి ఆనందించిన ఆగది ఒంటరితనమూ, నిశ్శబ్దతా చాలా అసహ్యంగా చీకాకు కలిగిస్తున్నాయి. ఒక లేతపాదం యీచివరినుంచి ఆచివరికి నడిచి వెళ్లినట్లనిపించింది. తనలో తెలియరాని ఒక గొప్ప మార్పు వస్తోందనుకున్నాడు రావు. లేచి ఒక పుస్తకం తీసి పేజీలు తిరగవేస్తూ, అలాగే నిద్రపోయాడు.

ఉదయం లేచేటప్పటికి మాంచి ఉత్సాహంగా ఫీలయాడు. డ్రెస్సువేసుకొని తిన్నగా వంతెనదగ్గరకు వెళ్లి మధ్యాహ్నం వచ్చాడు. ఒక కునుకు తీసి లేవగానే, నిర్మల నవ్వు మొహం జ్ఞప్తికి వచ్చింది. తక్షణం టాయిలెట్ చేసుకొని, గుమ్మం దాటగానే కారులో కుటుంబయ్య, లక్ష్మమ్మ, నిర్మల!

"రావోయి, అలా తోటలోకి వెళ్లివద్దాం" అన్నాడు కుటుంబయ్య. రావు జెట్టుసరికి "కొద్దిగా పనుంది, కంట్రాక్టర్ని..." అంటూ నసిగాడు. "ఆఫీష్యల్సు పనులు పనులంటారేమిటండీ ఎప్పుడూ. ఆనందించలేరుటండీ యిటువంటి యీవిన్నింగ్సు? మీరు తప్పక రావాలి" అంది నిర్మల చిరుకోపంలో దరస్మితాలని మిళితంచేసి.

ఆపలుకులకోసమే వేచి ఉన్నాడు. ఒక్కమారుగా కారులోకి గంతేసి ఆమెని ముద్దెట్టుకొందామనుకున్నాడు. లక్ష్మమ్మకూడా రమ్మంది. ఒక్క నిముషంలో వాళ్లందరూ తోటలో వున్నారు. "నారింజ బత్తాయి మామిడి...చక్కనితోట. ఎకరం పదిహేనువందలెట్టి మూడుఎకరాలు కొన్నాను." అన్నాడు కుటుంబయ్య సంతృప్తితో, గర్వంతో. తోటచుట్టూ తిరిగి లక్ష్మమ్మతో ఒకచోట కూలబడి, తన కోర్టుఅనుభవాలు చెపుతున్నాడు. రావూ, నిర్మలా ముందుకు సాగిపోయారు.

"నాకు తోటల్లో తిరగాలని సరదా" అంది నిర్మల.

"నాకున్నూ!"

"నా పెయింటింగులలో సహం యిక్కడ కూర్చొని వేసినవే" అంటూ ఆమె తన స్వవిషయాన్ని గురించి ధారాళంగా ముచ్చటించింది. రావు తన క్లబ్బు విషయాలు చెప్పుతూ యిలా అన్నాడు: "నాకు టెన్నిస్ అంటే ప్రాణం. ఒక కప్పుకూడా సంపాదించాను."

"నాకు టెన్నిసు ఆడేవాళ్లంటే యిష్టం.

టెన్నిస్ అంటే కోపం" అంది నిర్మల కొంటెగా. రావు ఉబ్బిపోయాడు ఆపలుకుల అర్థం ఎనలైజు చేసి!

దూరంగా త్రాచుపాము, హంతకుడి ఆలోచనలా, మెలికలుతిరుగుతూ వెళ్లింది. నిర్మల 'అమ్మో' అంటూ రావువొళ్లోకి ఒక్క గెంతేసింది. రావు భయంలేదని హెచ్చరించాడు. ఆమె అతని చేతుల్లోంచి తప్పించుకొని, ఏమీ ఎరగనట్టుగా "నాకు పాములంటే భయం" అంది. ఆమెస్పర్శ, వెంకట్రావులో జడంగాపడి ఉన్న శక్తుల్ని చైతన్యవంతంగా చేసింది. ఒక Thrill తన అణువణువులోనూ పొందాడు.

పచ్చనిచేలూ, పైరుగాలీ వారి తెచ్చికోలు మర్యాదలని ఒక మూలకిత్రోసి, ప్రకృతిస్వాతంత్ర్యంలోనికి లాక్కున్నాయి. తాను ఒక యింజనీరుననీ, ఆమె ఒక స్త్రీ అనీ మరచిపోయారు. నవ్వుకుంటూ శైశవ చేష్టలతో ఆడటం మొదలెట్టారు.

"ఆపండు ఎవరు ముందు అందుకుంటే వాళ్లది" అంటూ నిర్మల పరుగెత్తింది. రావు ఆమెని అనుసరించాడు. పండు రావుకే దొరికింది. "ఓడిపోయావు నిర్మలా!" అన్నాడు రావు. "మీవలె పరిగెత్తగలమా!" అంది వగరుస్తూ నిర్మల.

"మీ రబలలు—అబలలు" అంటూ రావు ఆమెతో కలసి తిరిగివచ్చాడు. మధ్యలో సంభాషణని 'పెళ్లి - దాని చరిత్ర' లోకి మార్చాడు, ఆమె ఉద్దేశ్యం తెలుసుకొందామని. ఆమె యిలా అంది: "కొన్ని శక్తుల్ని అభివృద్ధిపరచుకొందామన్న వాళ్లకి పెళ్లి అనవసరం. కాని, ప్రతీసామాన్యుడూ పెళ్లి చేసుకోవల్సిందే!"

"నువ్వు?"

"నేనా...నేనా...మీ రేంచేస్తారు." అంటూ నవ్వుతో సంభాషణ మార్చేసింది నిర్మల. పెళ్లి విషయం ఆడవాళ్ల నడగగూడదనీ, వాళ్లు సిగ్గుపడతారనీ తెల్సుకొన్నాడు రావు.

కారు ఎక్కినట్లూ, యింటికి వెళ్లినట్లూ జ్ఞప్తిలేదు రావుకి. గదిలో సామాను యిక్కడి దక్కడా, అక్కడి దిక్కడా వేసి చిందరవందరచేశాడు. పావలా తీసి "ఏదేనా కొనుక్కొని తినరా" అని కన్నయ్య కిచ్చాడు. అతనితల వేడెక్కిపోయింది. అద్దంలో చూసుకొని నవ్వుకొన్నాడు. ఆమె ముంగురుల్నీ, ఎర్రని పెదవుల్నీ, నవ్వేకళ్లనీ తల్చుకున్నాడు. కిటికీలోంచి ఆకాశంకేసి చూశాడు. మేఘాలు దట్టంగా క్రమ్మినై. హోరున వర్షం వచ్చింది. సముద్రపుగాలి అతని మొహానికి కొట్టుతోంది. ఆవర్షంలో తనూ, నిర్మలా తడిసి చలితో 'ఉహుహుఁ!' అంటూ ఇంటికి వస్తే ఎంత బావుంటుంది అనుకొన్నాడు.

ఎవరూ యిన్వెంటుచేయలేనివిషయం తను కనుక్కొన్నాడు. అది ప్రేమ — ప్రేమ! ఇన్నాళ్లకి ఆ తియ్యని అనుభవం పొందగలిగాడు. భావిజీవితం నిర్మలతో ఎలా గడపాలో ఆలోచించుకుంటూ నిద్రపోయాడు.

౪

ఆ వారంరోజులూ కుటుంబయ్యగారికుటుంబంతో చాలా సరదాగా గడిపాడు. లక్ష్మమ్మ అతనికి రోజుకన్న రోజు ఎక్కువ ఆదరం చూపెంది. ఇంక, చలాకీ నిర్మల! రోజూ పాటలు పాడేది, కబుర్లు అనేకం చెప్పేది. విద్యావతి, ఉత్సాహవంతురాలు, తన కన్నివిధాలా సరిపోయిన యువతి—ఆమెని తప్పక వివాహం చేసుకోదలిచాడు. కాని, లక్ష్మమ్మ, బి. యే. అయితే కాని నిర్మలకి పెళ్లి చెయ్యదలుచుకోలేదు కాబట్టి ఆఏడాదీ ఎలాగో అలాగ ఓపికపట్టదలచుకున్నాడు. ఆ ప్రసంగం నిర్మలదగ్గర తీసుకువద్దామనుకొన్నాడు కాని, ఆమె ఏమి చెపుతుందో అన్న భయమూ, సిగ్గూ అతన్ని అడగనివ్వలేదు. అయినా ఒకసంవత్సరంగా, తను వేచి ఉండేది.

ఉదయం లేచి స్నానాది కృత్యాలు తీర్చుకొని, ఒక్కడూ యీజీఛైరులో కూర్చొన్నాడు. ఆ సమయానికే నిర్మల చేతితో అట్టా, పెన్సిలూ పట్టుకొని వచ్చింది.

'నిర్మల!'—అలా వస్తుం దనుకోలేదు రావు.

"ఈవాళ మీరు వెళ్లిపోతున్నారుగా! ఈపది రోజులూ అలవాటు అవటంమూలాన్ని, మీరు వెళ్లుతున్నారంటే ఏదో కొత్తగా ఉంది. ఒక్కరూ గదిలో కూర్చొని ఏంచేస్తారు, రండీ, అలాతోటలోకి వెళ్లి Land-scape ని పెయింటుచేస్తాను, చూద్దురుగాని" రావు మాట్లాడకుండా ఆమెతో బయలుదేరాడు.

ఆర్టిస్టుకి కలిగే ఆవేశం కళ్లల్లో జ్వలిస్తూ ఉండగా, నిర్మల పెయింటింగు ఆరంభించింది. ప్రక్కనే నిల్చుని ఆనందిస్తున్నాడు రావు— ఆమె అంగుళులు దిద్దిన రేఖలకి కాదు, ఆమె భుజం వంపుకీ, వేళ్లకదలికకీ, కళ్లల్లో వెలుగుకీ. మధ్యలో ఏమేమో చెప్పాడు; కాని ఆమె వినిపించుకోలేదు. పూర్తిచేసి, విజయచిహ్నం చూపుల్లో దాచి "ఎలా వుంది" అంది.

"చాలా బావుంది - నీ అంత బావుంది." అనాలనే అన్నాడు రావు.

చిరుకోపంతో చూసి ఊరుకొంది. రావు ఆమె చెక్కిళ్లపై సిగ్గు గులాబీలు పూయటం గమనించాడు.

సాయంత్రం కుటుంబయ్యా, నిర్మలా స్టేషనుకు వచ్చారు, వెంకట్రావుని సాగనంపటానికి. రైలు తప్పిపోయినా బావుండునే, రైలుపట్టాలు కదలిపోతే,— యిలా ఉన్నాయి రావు ఆలోచనలు.

"నేను యిరవై రోజుల్లో మద్రాసు వెళ్లిపోతున్నాను. మీరు ఉత్తరం రాస్తారా? మీ రెక్కడ, యింజనీరుగారు! మీకు మూర్ మార్కెట్టులోంచి చక్కని ప్రెజంటు కొని పంపిస్తాను. మీరు ఏం యిస్తారు?" అంది నిర్మల.

చెమ్మగిలే కళ్లతో, రావు రైలులోంచి చేరుమాలు ఊపాడు. నవ్వుతో నిర్మల, కుటుంబయ్యతో వెనక్కి తిరిగింది.

✂

"సంవత్సరానికి అరవై రెండు నెలలు కాబోలు, వెధవసంవత్సరాలూ, మాసాలూ" అని విసుక్కుంటున్నాడు రావు. కన్నయ్య తన తెలివి నంతా ఉపయోగించి, వేళ్లు లెక్కపెట్టి 'పన్నెండు' అన్నాడు.

రెండు నెల లయింది తను నర్సాపురంనుంచి వచ్చి. కాని, నిర్మలదగ్గర్నుంచి ఒక్క ఉత్తరమేనా రాలేదు. తనఫోటో పంపి, ఆమెఫోటోకూడా పంపమని ఉత్తరం రాశాడు. కాని జవాబు రాలేదు.

రోజూ ఉదయం లేవటం, ఆఫీసుపని చూసుకోవటం, సాయంత్రం క్లబ్బుకి వెళ్లటం, శంకరంతో కష్టసుఖాలు మాట్లాడుకోవటం — ఇదీ రొటీన్. డిస్ట్రిక్టుయింజనీరు రాఘవరావు గుండె ఆగి, హఠాత్తుగా చచ్చిపోయాడుట! శంకరానికి ఆడపిల్ల కలిగింది. క్లబ్బువర్ధంతిలో నాటకంవేస్తే 'అ' మూర్ఛపోయాడు. థియేటరులో మంచిపిక్చరే ఆడటంలేదు. రోడ్డులు పాడైనవి రిపెయిర్ చేయించాలి, బాగున్నవి పాడు చెయ్యాలి. యుద్ధంలో అనేకమంది ప్రజలు చచ్చిపోతున్నారు. కన్నయ్యకి కాలిమీద కురుపులేచి, మానింది. బంగాళాదుంపలు సుబ్బయ్య కొట్టులో అయిపోయాయిట.... ఇవీ విశేషాలు. వెధవ సంవత్సరాలు, వెధవ విశేషాలున్నూ! వెంకట్రావుకి యిరిటేషన్ ఎక్కువైంది.

ఒక రోజున సాయంత్రం శంకరానికి రహస్యం చెప్పేశాడు: "వొరేయి! నేను ప్రేమించానురా!"

"ఏడిశావ్."

"నిజం!"

"బుజావు!"

"వినయితే కథ!" అని తన ప్రేమగాథని ఆవేశంతో చెప్పాడు.

"నువ్వు ఉత్తరం రాశావుకదా! ఫోటోకూడా పంపావుకదా! అయినా యీ రెండు నెలలకీ నీకు జవాబు రాలేదు. కాంక్లూజన్ ఏమిటీ—ఆమె నిన్ను ప్రేమించలేదన్నమాట." అన్నాడు శంకరం.

బిక్కమొహంతో యింటికి వెళ్లిపోయాడు వెంకట్రావు. వీధిలో జట్కాబండి, దీపస్తంభం అన్నీ తన్ని చూసి పరిహసిస్తున్నా యనుకొన్నాడు. తను నిర్మలతో గడపిన రోజులు జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు. "వెధవ శంకరం. వాడికి యీర్ష్య. లేకపోతే, నిర్మల నన్ను ప్రేమించకపోవట మేమిటీ" అనుకున్నాడు. "ఈవారంలో ఇంకొక ఉత్తరం రాస్తా. జవాబు రాకపోతే విషం మింగి పగ సాధించుకుంటా" అనుకున్నాడు. తర్వాతరోజున చిన్న వుత్తరం రాసి పంపాడు. "నీ ఉత్తరాలకి అయిదు వేస్టు పేపరు బేస్కెట్సు సరిపోలేదు. నీఫోటోలకి గోడలు సరిపోలేదు" అని రాశాడు. తనతెలివికి తనే సంతోషించాడు. లైబ్రరీలోంచి ప్రేమను గురించిన నవలలు తెచ్చుకొని చదవటం మొదలెట్టాడు.

వారం అయింది. జవాబు రాలేదు. 'రేపు' అంటే 'రేపు' అనుకొన్నాడు. పదిహేను రోజు లయింది; జవాబులేదు. "విషం మింగి ఎప్పుడూ చావను. ఛ!

ఇంతకంటె అందమైనదానినీ, విద్యావతినీ పెళ్లాడి, ఏడిపిస్తా" అనుకున్నాడు. ఒకవేళ ఆమె సిగ్గుపడిం దేమో· సిగ్గయితే, తనతో నర్సాపురంలో అలా అంత సరదాగా తిరుగుతుందా? ఆడవాళ్లని నమ్మకూడదు.

ఆరోజున మధ్యాహ్నం యింటికి వెళ్లలేదు· స్నేహితుని యింట్లో భోంచేసి, సాయంత్రం క్లబ్బుకి వెళ్లాడు. అతనికి చీకాకూ, తలనొప్పీ ఎక్కువయినై. ఒకానొక వాదనలో "ఆడవాళ్లకి స్వతంత్రం యివ్వకూడ దనీ, స్వార్థత్వమూ, మోసమూ వాళ్లలో హెచ్చు అనీ వాదించాడు. తర్వాత దీపస్తంభాలు లెక్కపెట్టుతూ యింటికి చేరాడు.

గుమ్మంముందు కన్నయ్య నుంచొనిఉన్నాడు· రోజూ అనేమాట ఇవాళ అనలేదు. "బాబుగారి కేదో పెద్ద పళ్లబుట్ట వచ్చింది. కమ్మనివాసన కొట్టుతోంది." అన్నాడు. ఒకవేళ ఏ కంట్రాక్టరేనా పంపా డేమో అనుకొని, తిన్నగా వెళ్లి వెంకట్రావు 'ఉస్సు' అంటూ కుర్చీలో కూలబడ్డాడు. కన్నయ్య ఒక పెద్దబుట్ట ఎదురుగా పెట్టి, చేతిలో ఒకకవరూ, పార్సెలూ పెట్టాడు. ఆత్రుతతో వెంకట్రావు కవరు తెరచాడు. నిర్మలదగ్గర్నుంచి. ఆనందంతో, స్పందించే హృదయంతో చదివాడు. అందులో ఉన్న సారం యిదీ— తను లాడ్జి మారటంవల్ల ఉత్తరాలు ఆలస్యంగా చేరినట్లూ, అదీగాక, అతని ఆత్రుతని వృద్ధిపొందించటం తన కొకసరదా అనీ వ్రాసింది. "రాజకీయా లంటే ఈమధ్య నాకు సరదా కలిగింది. చాలా ఇంటరస్టుతో చదువుతున్నాను...క్రితంనెల రేడియోలో నాపాట విన్నారా?... మీకు చాలా కోపం వచ్చి ఉంటుంది కదూ ఉత్తరం రాయలేదని...జీవితంలో నేను చేయవల్సిన పనులు చాలా ఉన్నా యనిపిస్తోంది. ఈ మధ్య ఆడవాళ్లం (విద్యార్థినులం) కలసి ఒక కల్చరల్ క్లబ్బు స్థాపించాము. కళలూ, విజ్ఞానమూ అభివృద్ధి పొందించటానికి...యింజనీరుగారూ! ఎన్ని రోడ్లు రిపెయిర్ చేయించారు..." ఇలాగే ఏమేమో రాసింది. పార్సెలు విప్పాడు, ఒక చిన్న సెల్యులాయిడ్ బొమ్మ, బుడగలూన్నూ—ఫోటో! అచ్చంగా నిర్మల—ఆ నవ్వుతోన్న మొహమూ, ఆముంగురులూ, ఆమృదువైన చేతులూ...

—ఆగలేని ఉద్రేకంతో ఆ ఫోటోని ముద్దెట్టుకొన్నాడు. గదితలుపులు వేసుకొని, ఉత్తరంలోని సుంద్రని అక్షరాల్లోని రహస్య హస్తవిన్యాసాన్ని తల్చుకొన్నాడు. ఈ శుభవార్త చెప్పినందుకు కన్నయ్యకి అయిదు రూపాయిలు బహుమానం యివ్వదలచుకొన్నాడు. ఆగదీ, టేబిలూ, గోడకి సాలీడూ, పుస్తకాల షెల్ఫూ— అన్నీ ఆనందంతో నవ్వుతున్నాయి.

తర్వాతరోజున ఆమెకి చాలా ఉత్సాహంతో వుత్తరం రాశాడు. ఆమె 'కల్చరల్ క్లబ్బు'ని పొగిడాడు. "నువ్వు నాకు దేవతవు" అన్నాడు ఒకచోట...

అప్పట్నుంచీ ప్రతీ పదిహేనురోజులికీ ఆమె దగ్గర్నుంచి ఉత్తరం వస్తోంది. ఎప్పుడూ సంగీతం గొడవా, కల్చరల్ క్లబ్బు విశేషాలూ. "స్త్రీ తల్చుకుంటే భారతదేశాన్నే కాదు, ప్రపంచాన్నే మార్చివెయ్యగలదు. ప్రపంచకల్యాణం మా చేతుల్లో ఉంది." అని రాసింది ఒకచోట. ఆ ఉత్తరాలు, మంత్రాలు చదివిచదివి విసుగెత్తిన పురోహితుడి మొహంలాగ ఉన్నా, వాటిల్లోనే కొత్త సొంపులూ, కొత్త అర్థాలూ కనిపెట్టుతున్నాడు వెంకట్రావు.

అయిదునెలలు యిలా గడిచినై. నిర్మలఫోటో చక్కని ఫ్రేములో అమర్చబడి బల్లమీద నవ్వుతోంది. హేమంతాలూ, శ్రావణాలూ అన్నీ ఒక వసంతంలా గున్నాయి రావుకి. రోజులు లెక్కిస్తున్నాడు. క్యాలెండర్లు తయారు చేసినవాళ్ల బుద్ధిహీనతని దూషిస్తున్నాడు. ఆ వూళ్లో ఒక చిన్న మేడని అద్దెకు మాట్లాడి ఉంచాడు, భావిజీవితం నిర్మలతో గడిపేందుకు. సంసారానికి కావల్సిన సామాను లేమేమిటో, రాత్రింబవళ్లు ఆలోచించి ఒక పట్టీ తయారు చేశాడు. ఆ పట్టీలో, ముందు పుట్టబోయే వంశోద్ధారకుడికి పాలపీపీలూ, తొక్కుడుబండీ, నిర్మలకు పియానో, కుంచెలూ, కాన్వాసూ కూడా ఉన్నాయి. ప్రావిన్షియల్ యింజనీర్సు సభలో ఉత్సాహంగా పాల్గొన్నాడు. కార్యనిర్వాహకవర్గంలో సభ్యుడైనట్టు ఆంధ్రపత్రికలో పడింది. పేపరుకటింగు ఒకటి నిర్మలకి పంపించాడు.

పెళ్లి అయి, సంసారం సాగిస్తూఉన్న మిత్రుల యింటికి తరుచు వెళ్లి, వాళ్ల సౌఖ్యమూ, వాళ్ల సొంపూ, సొగసూ చూసి నేర్చుకునేవాడు. "రహస్య అంటే

"చక్కని దేశమే కాని, ఫేమిలీ — కుటుంబ సౌఖ్యం ఉండదోయ్" అనేవాడు సోషలిస్టు కామ్రేడ్సుతో. తను నర్సాపురం వెళుతూన్నట్టు నిర్మల దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. కాని ఆమె తేదీ సరీగా వ్రాయక, 'మూడు నాలుగు రోజుల్లో' అని వ్రాసింది. రెండు రోజులు కాళ్లు పడిపోయేట్టు స్టేషను చుట్టూ తిరిగి ఆశాభంగం పొందాడు. "రాత్రిబండికి వెళ్లిందేమో" అని సమాధానపరచుకొన్నాడు.

నర్సాపురం వెళ్లి లక్ష్మమ్మని కల్సుకుని, పెళ్లి విషయం మాట్లాడుదామని నిశ్చయించాడు. కాని యింతలోకే అతనికి ప్రభుత్వం పని తగిలించింది. వారం రోజు లోపికపట్టి, ఆశతో, ఆనందంతో, ఉత్సాహంతో, కన్నయ్యని యింటిదగ్గర వుంచేసి, 'సిరికిం జెప్పడు' అన్నంత వేగంతో బయలుదేరాడు. మానవుడికి రెక్కలు ఉండటం చాలా అవసరమని యింజనీర్సు సభలో తీర్మానించటానికి నిశ్చయించుకొన్నాడు.

౬

ఏడాదిక్రిందటినిర్మలకన్న యీ నిర్మలలో సౌందర్యం యినుమడించింది. ఆమెకళ్లల్లో వసంతాలు నవ్వుతున్నై. ఆమె శరీరపు కదలికలో, పెదవి వంపుల్లో జవ్వనపు జిగిబిగి గోచరిస్తుంది. గులాబీరంగు రిబ్బను కొసను కట్టిన వాల్జడ సౌఖ్యానికి సోపాన సరణిలా ఉంది.

కుటుంబయ్యకి దగ్గు ఎక్కువయింది. లక్ష్మమ్మ చాలా సంతోషంతో ఆదరించింది. మొదటిరోజున నిర్మల అంతగా మాట్లాడలేదు రావుతో. ఏదో పుస్తకం తీసుకొని మేడమెట్లమీద కూర్చొని సాయంత్రం వరకూ చదువుతోంది. కొత్తగా నేర్చుకొన్న పాటలు పాడింది, తన యాక్టివిటీస్ నుగురించి చెప్పింది. ఆమె చలాకీతనానికి గాంభీర్యము తోడై కొత్త అందాన్ని కూర్చింది.

మరుసటిరోజున లక్ష్మమ్మదగ్గర బిడియపడుతూ వివాహప్రసంగం తెచ్చాడు. లక్ష్మమ్మ యిలా అంది: "నాయనా, నిన్నే అడుగుదామనుకొంటున్నాను. కావల్సినవాడవూ, ఉద్యోగస్థుడవూ, యింతకన్న నాకు కావల్సిందేమిటి? అమ్మాయి కూడా యిష్టపడుతుందనే నా ఉద్దేశ్యం. ఎప్పుడా ప్రసంగం తెచ్చినా, 'నీ కెందుకు, నీ గొడవ కా' దంటుంది. అయినా ఈవాళ అడిగి చూస్తాను. చదువుకొన్నవాడవు; దొరలల్లా మీరే ఆలోచించుకోండి."

లక్ష్మమ్మ అడిగి చెప్పేవరకూ రావు ఓర్పుపట్టలేకపోయాడు. మధ్యాహ్నం నాలుగు గంటలకి నిర్మలగదిలోకి వెళ్లాడు. నిర్మల వీణవాయిస్తోంది.

"నిర్మలా!"

"ఊఁ!"

"నీతో ఒక విషయం మాట్లాడాలి."

"చెప్పండి."

"ఇక్కడ కాదు – తోటలో!"

ఆమె విశాలమైన కళ్లనెత్తి రావుకళ్లల్లోకి చూసింది. ఆమె బుగ్గ లెర్రబడ్డాయి. కాని ఏమీ తెలియనట్టు 'అలాగే' అంది.

తోటలో మామిడిచెట్టుక్రింద నిల్చుని ఆమె నడిగాడు, ఆమె చేతిని తన చేత్తో పట్టుకొని. ప్రకృతి పవిత్రమైన గంభీరత దాల్చింది. పచ్చని చేలు ఎండలో మెరుస్తున్నాయి. ఆవేశం రావుగొంతులో 'జలజలించింది.'

"నిర్మలా! నేను చెప్పబోయే విషయం నీకు తెలిసే ఉంటుంది. నేను తలిదండ్రులు లేనివాణ్ణి. స్వశక్తిచేత యీ స్థితిలోకి వచ్చాను. నాకు నూటపాతిక రూపాయిలజీతము, మేనత్త రాసియిచ్చిన పాతిక ఎకరాలు నా ఆస్తి...... నాకు జీవితంలో ('జీవితం' అని ఉచ్చరించినపుడు అతని గొంతు వణకింది. అతని బ్రతుకు తన ఎదురుగా నిల్చొని నవ్వినట్టనిపించింది.) ఏ కోర్కె లేదు – ఒకటి తప్ప. నా కష్టసుఖాల్ని పంచుకొందుకు, నా ప్రేమకు తిరిగి ప్రేమ యివ్వటానికి, నా యింట్లో ఒక దేవత–ఒక చిరునవ్వు– ఒక స్త్రీ...(అతని గొంతు తిరిగి ఒణికింది.) నిన్ను ప్రేమిస్తున్నాను నిర్మలా! నీ ప్రేమ అమూల్యం. నిన్ను పెళ్లి చేసుకోవాలని నా కోరిక. నీ తల్లి యిష్టపడింది. నువ్వు, నువ్వు...ఒప్పుకోవాలి అంతే."

నిర్మల ఒకమారు రావుకేసి చూసి రెప్పలు కిందకి వాల్చింది. రావు ఆమెచేతిని నొక్కుతూ,

"చెప్పు నిర్మలా!" అన్నాడు. ఆమె తిరిగీ అతనికేసి చూసి రెప్పలు వాల్చింది. ఆమౌనం చిరుమంటలా రావుగుండెలో సెగల్ని జల్లుతోంది. తిరిగీ అడిగాడు రావు. స్ఫుటంగా, మృదువుగా నిర్మల యిలా అంది:

"మీరు వేరొకవిధంగా తలిస్తే నేను చెప్ప లేను. నాకు మీయెడ విముఖభావం లేదు. ఈ ఏడాదిలో నా ఉద్దేశ్యాలు మారిపోయినై. కళకీ, సంఘానికీ సేవచేయటానికి నేను కంకణం కట్టుకొన్నాను. నాకు పెళ్లి చేసుకొనే ఉద్దేశ్యం ఏమీ లేదు. మీకు కష్టం కలిగిస్తే క్షమించండి. కాని యిది నిశ్చయం."

రావు ఆమెచేతిని వదిలివేశాడు. కళ్లమ్మట పొర్లివచ్చే నీళ్లు, పగిలిపోయే గుండె కనపడకుండా, వెనక్కు తిరిగి, మొహం చేతుల్లో దాచుకు చరచరా వెళ్లిపోయాడు. 'రావు, రావు' అని పిలుస్తున్న నిర్మల కేక అతను వినిపించుకోలేదు. నిర్మల యింటికి వెళ్లింది; రావు కన్పడలేదు. "అర్జంటు పని అంటూ వెంకట్రావు యీబండికి వెళ్లిపోయాడమ్మాయి!" అంది లక్ష్మమ్మ. నిర్మల జాలితో నిట్టూర్చింది:

౭

వెంకట్రావు కొన్నాళ్లు వీధిలోకి వెళ్లలేదు. నిర్మలఫొటో శంకరాని కిచ్చేశాడు. ఒక్కడూ ఆకాశం కేసి చూస్తోండేవాడు—మబ్బులు, నక్షత్రాలు, చీకటి, పవలు, సంధ్య, అన్నీ ఆ తెరమీద నాటక మాడుతూండేవి ఈ ఏకాంతప్రేక్షకుడికోసం.

రోజులూ, వారాలూ, నెలలూ గడిచినై. వెంకట్రావు వీధిలోకి వెళ్లటం మొదలెట్టాడు. ఆ వూరి కంట్రాక్టరుతో రోజూ ఒకగంట బాతాఖానీ, రెండు గంటలు పేక ఆడేవాడు. సాయంత్రం క్లబ్బుకి వెళ్లి నలుగురితోనూ కలిసి కూర్చొనేవాడు. కాని "చాలా మితభాషి అయాడురా రావు" అనేవారు స్నేహితులు. యుద్ధాన్ని గురించీ, ఆరోగ్యశాఖని గురించీ, టెన్నిస్‌ను గురించీ అందరూ చెప్పకొనే కబుర్లు విని, ఆలస్యంగా ఒక్కడూ చీకట్లో యింటికి వెళ్లేవాడు. "బాబుగారు అలసిపోయారు" అంటూ కన్నయ్య ఎదురుగా వచ్చేవాడు.

ఏడాది గడచింది. అతనిలో ఒకవిధమైన అసంతృప్తీ, అశ్రద్ధా పాదుకొనిపోయినై. ఆ రోజున తిన్న భోజనపదార్థాలు ఏవోకూడా చెప్పలేడు. శంకరంతో యిలా అనేవాడు: "ఆరోజులు వేరోయ్! కాని ఆమె నా జీవితాన్ని భస్మంచేసింది." ఎవరేనా తన వివాహప్రస్తావన తెస్తే, చిరునవ్వుతో యిలా అనేవాడు: "ఇరవై ఆరేళ్లుకదాండి — అదే, ఇరవైయేడు వచ్చింది. అంటే సగం జీవితం అయింది. ఆ సగమూ సుఖంగా యిలా పోనివ్వండి!" అతను ఉద్యోగంవిషయంలో యిదివరకటికన్నా పట్టుదల ఎక్కువ చూపాడు. జీతంలో యింక్రిమెంటువచ్చింది.

సాయంత్రం పొలాలగట్లనుంచి వస్తో వివిధ వృక్షాల్ని పరికించేవాడు. కన్నయ్య ఆ ఏడాది వర్షాల్ని గురించీ, రైతుల కష్టాల్ని గురించీ చెప్పేవాడు. రోడ్డుమీదకు రాగానే "ఓహో! యింజనీరుగారా! నమస్కారం" అని పలకరిస్తారు ఒకరు.

"కనపడటం మానేశారేం" అంటాడు రావు.

"మాచిన్న వెధవకి ఒంట్లో బాగా లేదు. అదీగాక మాఅమ్మాయి పురుడుకొచ్చింది."

"అలాగా?"

"మా రోడ్డువిషయం మీరు కొద్దిగా దయ ఉంచాలి."

"ఏంరోడ్లండీ! గవర్నమెంటు కాదాయం తగ్గిపోతోంది. ఈడిస్ట్రిక్టుబోర్డు వచ్చాక మరీ అధ్వాన్నం అయిపోయింది." అంటూ చిన్నగా దగ్గుతాడు రావు.

"మరేనండీ! ఈమున్సిపాలిటీలు-'అమ్మిరాజు' ఛైర్మను అయాక దరిద్రమే పట్టుకొంది. 'ఓ' అంటే 'న' రాదు, డబ్బుగుప్పేసి పదవిసంపాదించాడు."

"కలికాలం!"

"చూడండి ఈమురికికాల్వలూ...అబ్బ, వెధవ దోమలూ, వెధవ యిదీన్ని" అంటాడు ఆ పెద్దమనిషి.

అక్కణ్ణుంచి తిన్నగా యింటికి వెళ్తాడు రావు. కొత్తమిత్రుడు రాజులు యం. యస్ సి. వస్తాడు. తెలివైనవాడూ, మంచివాడూ కాని, అహంభావపుపాలు ఎక్కువ. నోబుల్‌ప్రయిజు తనకి ఎప్పుడో వస్తుందనే నమ్మకం—తను ముందు చేయబోయే రిసెర్చికి. తర్వాత భోజనం, ఆఫీసుకాగితాలు చూసుకోవటమూ, కిటికీలోంచి విశాలమైన బయలుచూడటమూ. కన్నయ్య "పెళ్లాంమీద బెంగ పుట్టింది, సెలవిప్పించండి"

అంటాడు. ఆ నక్షత్రాలు ఒక్కొక్కటే రాలిపోతే, యింజనీర్లు ఆకాశానికి రోడ్డువేస్తే, దెయ్యాలు తన్ని love చేస్తే — ఇలా ఆలోచించుకుంటూ భయంతో నిద్రపోతాడు. ఉదయం తను పక్కమీదనుంచి లేవకుండానే దాసీది రావటం, అంట్లు చప్పుడు చెయ్యటం, కన్నయ్య దానితో సరసా లాడటం వింటాడు. లేచి స్నానంచేసి డ్రెస్సువేసుకొంటాడు. తిరిగీ ఆఫీసుపని. సాల్యూటుచేసేవాళ్లకి సాల్యూటుచేస్తూ, కీవిలో చిరునవ్వు మిళితంచేస్తూ మాట్లాడాలి. అందరూ 'యింజనీరుగారు' అంటూ గౌరవిస్తారు; అంతేకాని, ఒక పధ్నెనిమిదేళ్ల పిల్ల చేతిలో వోడిపోయాడనీ, ఆమెవెనకాల ఉన్మాదుడులా తిరిగాడనీ ఎవరికి తెలుసు? సాయంత్రం క్లబ్బుకి! తిరిగీ యుద్ధాన్ని గురించీ, రేడియోని గురించీ కబుర్లు. వసంతరావు తన రసికత్వాన్ని గురించి సగర్వంగా విశదపరుస్తాడు. ప్లీడరు రామచంద్రరావు పార్కులో మొక్కల్ని గురించీ, శ్రీనివాసరావు రేడియో రిపెయిర్లనిగురించీ లెక్చర్లిస్తారు. అమ్మిరాజు తను సన్నంగా ఉండేటందుకు మార్గాలు చెప్పమంటాడు. చివరికి అందరూ పేకాడుతారు. తనకి ఎప్పుడూ నష్టం వస్తుంది. రాత్రి ఒక్కడూ యింటికి వెళ్తాడు. కన్నయ్య "బాబుగారు అలసిపోయారు" అంటూ, చీకటి నవ్వుతో ఎదురౌతాడు.

వెధవకలలు వచ్చిన పెద్దనిద్రలాగ, మూడేళ్లూ గడిచిపోయాయి. వెంకట్రావుకి జీతం రెండువందల దాకా పెరిగింది. అతనికి ప్రపంచంలో ఆనందించవల్సిన వస్తువూ, విచారించవలసిన విషయమూ ఏమీ లేవు. నిజానికి అతనిదృష్టిలో అన్నీ ఒకటే! ఏడుపూ, నవ్వూ లేనివాడు తనొక్కడే అనుకొన్నాడు.

ఆరోజున ఒక్కడూ సిగరెట్ కాలుస్తూ యీజీఛైరులో పడుకొని ఆలోచిస్తున్నాడు, దేవుడు గూడా లేడా అని. తను చాలా పెద్దవాడైపోయినట్టూ, వృద్ధాప్యాన్ని సమీపిస్తూన్నట్టూ తల్చుకొని ఉలిక్కిపడ్డాడు. కన్నయ్య ఒక్కగంతేసి "అమ్మాయిగారు వచ్చేరండి." అన్నాడు.

"ఎవరురా?"

"అమ్మాయిగారు — నర్సాపురం అమ్మాయిగారు."

దీనంగా, ధైర్యంగా చూస్తో, నిర్మల సుమ్మంముందు నుంచొంది. రావు ఆమెఅకస్మాత్ ఆగమనానికి తెల్లబోయాడు. ఏమనాలో తెలియక కంగారు పడ్డాడు.

"నేను రావటం మీకు చాలా ఆశ్చర్యంగా ఉంటుంది." అంది నిర్మల, పేలవంగా నవ్వుతో. వెంకట్రావు తేరుకొని లేచి ఆమెని ఆహ్వానించాడు. అతను చాలా నెమ్మదిగా మాట్లాడాడు:

"కుటుంబయ్యగారు క్షేమమా?"

"పోయారు – ఏడాది అయింది."

'పాపం!'అన్నాడు రావు. నిర్మలలో పూర్వపు చలాకీతనమూ, అయస్కాంతంలా ఆకర్షించే పెర్సనాలిటీ అంతలేదు. ఆమెలో వెలిగే సహజమైన నవ్వూ లేదు. ఆనవ్వుయొక్క మాసిపోయిన ఛాయలుమాత్రం కన్పడుతున్నాయి.

"మీ అమ్మగారేం చేస్తున్నారు?"

"కాశీ వెళ్లిపోయింది కోపంవచ్చి."

"ఏం – నిర్మలా?"

"నేను పెళ్లి చేసుకోనన్నానని."

తర్వాత మౌనం. గతసంగతులు జ్ఞప్తికి వచ్చి, ఇద్దర్నీ కలచివేశాయి. వెంకట్రావు కిటికీలోంచి ఆకాశంకేసి చూస్తున్నాడు; పిల్లమబ్బులు గంతులేస్తున్నాయి, లేగదూడలలాగ. ఇంతకీ ఆమె ఎందుకొచ్చిందీ?

"ఈగది అంతా యింత చిందరవందరగా ఉందేం? ఆడదిక్కులేందే మగవాళ్లు యిలాగే ఉంటారు" అంది నిర్మల. ఆపలుకుల్లో ఆశా, ఆత్రుతా, పరితాపమూ గుడిగంటల్లా శబ్దించాయి. తొమ్మిది గంటలకి రావు ఆఫీసుకు వెళ్లిపోయాడు. నిర్మల రావు యింట్లోనే ఆగిపోయింది. సిగరెట్టుపీకలూ, పుస్తకాలూ, కాళీఅగ్గిపెట్టెలూ, పాతబట్టలూ — గది అంతా అసహ్యంగా వుంది. తిరిగీ రావు సాయంత్రం యింటికి వచ్చాడు. సుమ్మానికెదురుగా నిర్మల నవ్వుతో నుంచొంది. ఇదివరకటికన్నా ఆమె పెద్దదయింది. ఆ సమయంలో తిరిగీ నిర్మలలో పూర్వపునవ్వూ, కళ్లల్లో వెలుగూ కలిగినై. రావు యిల్లంతా చూశాడు. అన్నీ చక్కగా అమర్చబడి ఉన్నాయి.

"నిర్మలా—నువ్వేనా?" అన్నాడు రావు.

"ఏం, బావూ లేదూ" అంది నిర్మల. వెంకట్రావు మాట్లాడలేదు. నిర్మలకి కష్టమనిపించింది.

"కోపమా మీకు, స్వతంత్రం తీసుకున్నానని?"

"కాదు నిర్మలా! చాలా సంతోషం. కాని నామనస్సుకి పూర్వపుగది శాంతీ, సంతోషమూ యిస్తుంది."

నిర్మల వులిక్కిపడింది. అతనిలో ఎంతభేదం కలిగిందో, మానసికంగా! రావుదగ్గరగా కుర్చీలో కూర్చుని తన్నిగురించి యిలా చెప్పింది: "నేను యితర యాక్టివిటీస్ మానేశాను, నాకు విసుగెత్తింది. అవన్నీ భ్రమలు ... అందరూ విమర్శించేవారే! నాకున్న ఉత్సాహం యితరులికి లేదు. నాకోసమా అనిపించింది. అవన్నీ భ్రమలు ... రావు. లేకపోతే స్త్రీలకు పబ్లిక్ జీవితం ఏమిటి?"

'నిజం' అన్నాడు రావు.

"నిజం — ఈనూడేళ్ల జీవితమూ - ఎంత వృథా చేశానో!"

రావు ఆమెకేసి చూశాడు. ఆమెలో పశ్చాత్తాపమో, బాధో వ్యక్తమవుతోంది.

ఇద్దరూ కలిసి షికారు వెళ్లారు పొలాలగట్లకి. రావు తనఆఫీసుపనుల్ని గురించి ముక్తసరిగా చెప్పాడు. ఒకరి హృదయంలో తళుకొత్తే ఆశా, నిరాశా, మరొకరి హృదయంలో మ్రోడుపోయిన చైతన్యమూ నీడలులా, దెయ్యాలులా కదుల్తున్నాయి. ఎక్కువ సేపు యిద్దరూ మౌనంగానే ఉన్నారు.

ఇద్దరూ క్యారేజిభోజనంచేశారు. మధ్యగదిలో రావూ, ప్రక్కగదిలో నిర్మలా పడుకొన్నారు. వరండాలో కన్నయ్య గుర్రుపట్టుతున్నాడు.

పంన్రెండుగంట లయింది. రావు పడుకొన్నదీ లేందీ చూద్దామని నిర్మల రావుగదిలోకి వచ్చింది. రావు రెండుచేతులతో తలని పట్టుకొని కుర్చీలో కూర్చొన్నాడు. "మీరు నిద్రపోలేదా?" అంది నిర్మల.

"......"

"జబ్బుచేస్తుంది."

"నాకు అలవాటే!"

"తల అల్లా పట్టుకున్నారేం?" నిర్మల అతన్ని సమీపించి అతనికణతల్ని తాకింది. అవి కొట్టుకుంటున్నాయి.

"తలనొప్పి ఎక్కువగా ఉందా?"

"అంత ఎక్కువలేదు."

నిర్మల తనగదిలోకి వెళ్లి అమృతాంజనంతో తిరిగీ వచ్చింది. "చేతులు తియ్యండి, రాస్తాను. నాకు చెప్పలేదేం? ఎందుకు వొక్కరూ అలా బాధపడతారు?"అని ఆతనికణతల్ని తాకబోయింది. వెంకట్రావు ఆమెని వారించి, ఆమెచేతిలోని డబ్బాతీసి బల్లమీద పెట్టాడు. ఆమె అక్కడ కొంతసేపు నుంచొంది. అమానం ఆమెకి దుర్భరమైంది. తడబడుతూ ప్రక్కగదిలోకి వెళ్లి కూలబడింది. ఒకనిముషానికి వెంకట్రావుకు వెక్కివెక్కి యేడుపు వినపడింది. ఆమెగదిలోకి వెళ్లి "ఛ! నిర్మలా, ఏడుస్తున్నావా?" అన్నాడు.

"నేను రావటం మీకింత కష్టంగా ఉందని నాకు తెలియదు. నేను మీకు అవసరసమయంలో సేవ చేయకూడదూ?మనపూర్వస్నేహంమరచిపోయారా!" ఆమె యింకా తలగడలో మొహం కప్పుకొని ఏడుస్తో ఉంది.

"లేదు నిర్మలా..."అతనిగొంతుక బరువెక్కింది. "నేనేం చేస్తున్నదీ నాకొక్కొకసారి తెలియదు. నీరాక నాకు కష్టం కలిగించలేదు. నీకు కష్టం కలిగిస్తే క్షమించు. నాయింటికి వచ్చిన స్నేహితురాలివి, అతిథివి. నీసౌఖ్యం చూడవలసిన విధి నాకుంది" నిర్మల తల పైకెత్తింది.

"మీకు నేను అంతేనా? అతిథినేనా? మీ జీవితానికి యింక ఎందుకూ ఉపయోగపడలేనూ?" ఆమె గొంతు గద్గదికమయింది.

"నాకు జీవిత మనేది వుంటే అది జరిగిపోయింది. నాకు కోరికలు లేవు. అందుమూలాన్ని ఒకరిసాహాయ్యం అవసరమని అనుకోను. నాకు రొటీన్ అలవాటయింది. జీత మిస్తారు పనిచేస్తాను — అన్నింట్లోనూ అంతే"

"ఇంక ఎందుకూ ఉపయోగపడలేనూ మీజీవితానికి? చెప్పండి, చెప్పండి" ఆమె విహ్వలతతో అడిగింది.

"నిర్మలా, ఒకరికొకరు పనికివస్తా రనుకోవటం పిచ్చివూహ. పడుకో నిర్మలా! తలితండ్రులు లేరు

నీకు. ఈగృహంలో ఎవరికేనా నీడనిస్తాను, నాకు సంపాదనాశక్తి ఉన్నంతవరకు. అలా యిచ్చేందుకు భగవంతుణ్ణి శక్తి యిమ్మని ప్రార్థిస్తాను."

"ఎంత మారిపోయారు మీరు!" అంది నిర్మల, కళ్లు ఒత్తుకుంటూ. ఆమె తల ఎత్తేటప్పటికి రావు అక్కడ లేడు. చలిగాలి తలుపుసందుల్లోంచి కీచుమంటూ వీచింది.

ఉదయం రావు లేవగానే కన్నయ్య వచ్చి "అమ్మాయిగారు వెళ్లిపోయారు బాబూ! మీతో చెప్పమన్నారు" అన్నాడు.

"ఎంతసేపయింది?"

"ఇప్పుడే-వీథిలో ఉంటారు."

వెంకట్రావు గుమ్మంలోకి వెళ్లాడు. ఫర్లాంగు దూరంలో కారుదుమ్ములో నిర్మల నడిచి వెళ్లిపోతోంది—స్టేషనుకి!

౮

ఎనిమిదినెలలు గడిచాయి. ప్రభుత్వం వెంకట్రావుని ఫారెస్టురేంజికి బదిలీచేశారు. ఒకరోజున కన్నయ్యతో, సామానుతో బయల్దేరాడు రావు.

ఆవూళ్లో మూడువందలగడపకన్న ఎక్కువ జనాభా లేదు. రెండుమైళ్లదూరంలో అరణ్యం కన్పడుతుంది. ఆవూళ్లో ఒక పెంకుటిల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నాడు రావు. కాని అక్కడ అతనికి భోజన సదుపాయం లేదు. ఒకనెల జరిగాక శంకరానికి ఉత్తరం రాశాడు వంటలక్కనిగాని, బ్రాహ్మడినిగాని పంపమని. పదిహేనురోజుల్లో కేశాలున్న విధవ సుందరమ్మ వచ్చి పొయ్యి రాజేసింది.

ఆ వూళ్లోవాళ్లకీ, ప్రక్కగ్రామాలవాళ్లకీ యింజనీరుగారు ప్రత్యక్షదైవం. పులితోళ్లూ, దుప్పిచర్మం, కొమ్ములూ, అల్లోనేరేడిపళ్లూ, యింకా వివిధములైన ఫలసముదాయాలూ ప్రతీవారం వెంకట్రావుకి భక్తిశ్రద్ధలతో అర్పించేవారు. వాళ్ల ఆచారవ్యవహారాలు చిత్రంగా ఉన్నై. వాళ్లు మాట్లాడే తెలుగు ఒక్కొక్కసారి అర్థమయ్యేదికాదు. పట్టణాల్లో ఉండే కృత్రిమత్వం, అతితెలివీ అక్కడ లేవు. కష్టపడి పనిచేసుకుంటారు, అనుభవిస్తారు. పార్టీప్రభుత్వాలూ, యుద్ధాలూ, ప్రజావాదమూ, సామ్యవాదమూ, ఆత్మహత్యలూ, రోడ్డుదుమ్మూ, సినీమాలూ, ప్రేమలూ, విరహాలూ వారిని బాధించవు. కడుపునిండా తింటారు, సిలవివార నవ్వుతారు! సలహాలకి వెంకట్రావుదగ్గరకే వస్తారు.

నాలుగునెలల్లో అతనిలో మార్పుకలిగింది. అతని కళ్లల్లో జాలి గోచరించేది. అతనిజీవితం కరగి కళ్లల్లోకి వచ్చిందా అనిపిస్తుంది. తిరిగీ, ఇదివరకటి రొటీను—జడత్వమూ!

ఆ వూరినీరు పడక అతనికి పెద్ద జబ్బు చేసింది. దగ్గర్లో డాక్టరు ఎవడూ లేడు. ఊళ్లోఉన్న భిషగ్వరుడు చెంచయ్య మందిచ్చేవాడు. రెండురోజులు స్మృతి లేకుండా పడిపోయాడు. రాత్రింబవళ్లు సుందరమ్మ, ఏమరక, అతనికి ఉపచారంచేసింది. ఆమెఓర్మికి ఆశ్చర్యపడ్డాడు. ఆమెతో "మీ ఋణం ఎలాతీర్చుకోను" అన్నాడు. నెల్లాళ్లకి జబ్బుతగ్గింది. చంచయ్యకి యాభై రూపాయ లిచ్చాడు. అంతడబ్బు అత నెప్పుడూ కళ్లతో చూడలేదు. జీవితాంతంవరకూ, తన వైద్యశక్తినిగురించీ వెంకట్రావు దాతృత్వాన్నిగురించీ చెప్పుకొనేవాడు. రెండునెలలలో పూర్వపు జవసత్తువలు సంపాదించాడు వెంకట్రావు.

శంకరానికి వుత్తరం రాశాడు, కొన్నిచీరలూ, సామానులూ పంపమని. సుందరమ్మ ఆ విలువగల చీరలన్నీచూసి "నా కెందుకండీ యివన్నీ" అంది. "కట్టుకోండి తప్పేముంది." అన్నాడు రావు. సుందరమ్మ అవి ధరించటానికి భయపడేది.

ఆరోజున వెంకట్రావు అర్ధరాత్రి ఉలిక్కిపడి లేచాడు. వెన్నెల విరగకాస్తోంది. 'శవంమీదకప్పిన తెల్లబట్ట'లా ఉం దనుకొన్నాడు. ఇంతలో ప్రక్కగదిలోంచి సన్నగా ఏడ్పు వినపడింది. నిర్మల జ్ఞప్తికి వచ్చింది. ఆ గదిలోకి వెళ్లాడు. కిటికీలో కూర్చొని బయలు చూస్తోంది సుందరమ్మ. ఆమె నల్లనిపొడుగాటిజుట్టు ఆమె యొడల్ని కప్పింది. వెన్నెలవెలుగులో ఆమెవదనంమీద నీటి బొట్లుచూశాడు రావు.

"ఏడుస్తున్నారా?" అన్నాడు.

'లేదు' అంటూ, ఆమె సిగ్గుతో, తడబడుతో లేచింది.

"ఎందు కేడవటం? — గతాన్ని మరచిపోండి." అన్నాడు దయతో.

"నాకు గతమనేది లేదు, నాకు జీవితమే లేదు. నన్ను ఆదరించేవారు లేరు. 'నా'అన్నవారు లేరు. నేను బాల్యంలోనే విధవనయాను." ఆమె ఏడుస్తోంది చిన్నపిల్లలా.

'ఏం' అన్నాడు వెంకట్రావు. చీకట్లో నడిచేవాడికి దీపంకన్న మరొకపాంథుడు ఎక్కువ సహాయంగా ఉంటాడు. అందుకే వెంకట్రావుకి క్యూరియాసిటీ ఎక్కువయింది.

"నేను ఒకవిధవకి జన్మించాను. నాతల్లి నన్ను అమ్మేసింది, హోటలు పెట్టుకొన్న వెంకమ్మకి. కాని దానిప్రియుడు ఒప్పుకోలేదు. ఆవెంకమ్మ నన్ను పిల్లలు లేని తండ్రికి అమ్మింది. అతను ఎన్మిదేళ్లదాకా విద్యాబుద్ధులు చెప్పించి, ఒకడికి పెళ్లిచేశాడు. ఆతర్వాత చచ్చిపోయారు పెంపుడుతండ్రీ, మొగుడూన్నూ — ఒకేఏడాదిలో. ఆ తర్వాత ఒకరింట్లో పిల్లల నెత్తుకొనేదాన్ని. అక్కడ నాలుగేళ్లు పనిచేసి మానేశాను. తిండి లేక ఒకరోజున ఒకడికి మానాన్ని అమ్మాను. అప్పణ్ణుంచీ, ఆవూరువిడిచి నేటిదాకా వంటచేస్తున్నాను. మూడుసార్లు అమ్ముడుపోయాను!"

వెంకట్రావుహృదయం కరిగింది. జాలితో ఆమెభుజంమీద చెయ్యి వేశాడు. ఆమె ఆశతో, కాంక్షతో చూసింది. వెంకట్రావు, తెలియనికాంక్షచేత ప్రోత్సహింపబడి ఆమెని కవుగలించుకొన్నాడు.

నాటినుండీ, సుందరమ్మ అతనికి వంటలక్క, భార్య, ఆదరించే తల్లీన్నూ. ఆమెను 'మీరు' అనే పిలిచేవాడు.

ఒకఏడాది గడిచాక, వెంకట్రావు, ఆమెకోరికమీద ఆమెని కాశీ పంపించాడు. రెండునెలల్లో ఆమె తిరిగి వచ్చి కాశీవిశేషాలు చెపుతూ యిలా అంది: "పాపం, నర్సాపురంనుంచి లక్ష్మమ్మఅనే ఆవిడ నాలుగేళ్లనుంచి అక్కడ ఉంటోందిట! పోయింది, వారంక్రితం."

'అరెరె!' అన్నాడు వెంకట్రావు.

మూడేళ్లు గడిచాయి. ఒకనాడు రావుకి ప్రభుత్వపు ఆర్డరు వచ్చింది. విప్పిచూశాడు; తనకు డిస్ట్రిక్టు యింజనీరుపదవి యిచ్చింది ప్రభుత్వం. ఆనందంతో, సుందరమ్మతో యిలా చెప్పాడు: "రెండునెలల్లో మనం మనజిల్లా వెళ్లిపోవచ్చు. అక్కడ సుఖంగా ఉంటుంది."

సుందరమ్మ కడుపుతో ఉంది. ఆమె గర్భవిచ్ఛిత్తి చేసుకొంటానంది. కాని రావు ఒప్పుకోలేదు. "నాప్రతిరూపాన్ని చంపుకోలేను. నాకు మూడువందల రూపాయల జీతం వస్తోంది. నాజీవితం, నాపేరు నాతో అంత మవకుండా ఒకకొడుకు కావాలి నాకు"అన్నాడు. ఈమూడేళ్లనుంచీ, వారి మధ్య జీవితం చాలాగౌరవంగా నడిచింది. ఒకరితో ఒకరు ఆట్టేమాట్లాడుకోరు. సుందరమ్మను 'మీరు' అనే పిలిచేవాడు. కాని ఆరోజున సుందరమ్మ కొత్తమార్గం తొక్కింది. "నన్ను మీరు మన్నిస్తే నేనిక్కడ ఉండలేను. మీలో ఒకభాగంగా మెలగుదా మనుకొంటూన్న నాకు, మీరే సర్వంఐన నాకు—" ఆమెకళ్లమ్మట నీటిబిందువులు పొర్లినై. వెంకట్రావు తెల్లపోయాడు. ఆమెమీద అతనికి జాలీ, దయా ఉన్నై. 'ప్రేమ' అనేదిఅతనుమరచిపోయాడు, పాతిపెట్టేశాడు. ఒక్కొక్కసారి 'ప్రేమ'కల్లఅనీ, అది భక్తులకి పూనే ఆవేశంలా యువకులకి పూనుతుందనీ అనుకొనేవాడు. కుటుంబసౌఖ్యానికి స్త్రీపురుషుల మధ్య పరస్పరావగాహనా, అనురాగమూ కావాలనీ, ప్రేమ కవులకీ, రచయితలకీ వదలివెయ్యాలనీ అతని ఉద్దేశ్యం. అయినా, అతను ఏ విషయంలోనూ ఎక్కువ ఉత్సాహం తీసుకోలేదు. అతనిలోని శక్తులు మోడుచెందాయి. తనకి స్త్రీన్నీ, కొడుకూ అవసరం. అదిగాక సుందరమ్మ అంటే అతనికి 'సింపతీ' ఉంది. అయినా, నవ్వుతో సుందరమ్మతో యిలా అన్నాడు. "నిన్ను మన్నించటంలేదు సుందరమ్మా! అలవాటుచొప్పున అనుకుంటున్నాను. నీసౌఖ్యం నా సౌఖ్యం" ఆరోజునుంచీ 'నువ్వు' అనేవాడు. సుందరమ్మ ఆనందంతో పొంగిపోయింది. "ఆయన యింటికి వచ్చేటప్పటికి అబ్బాయి ఎదురుగా వెళ్లి 'నాన్నా' అని పిలుస్తాడు. ఆయన అబ్బాయిని ముద్దెట్టుకుంటా"రని ఆలోచిస్తోండేది.

విధినల్లని పెదవులు వారి జీవితాన్ని ముద్దెట్టుకొన్నాయి. నెల్లాళ్లకి, పురిటిగండంవచ్చి తల్లీ పిల్లా చనిపోయారు. ఆరోజున భోరున ఏడ్చాడు వెంకట్రావు. కాని తర్వాతరోజున మామూలుమనిషి అయాడు నాటినుంచీ నవ్వుఅంటే అతనికి రోతపుట్టింది. కొన్నాళ్లకు,కన్నయ్యతో,గోదావరిజిల్లాకు ప్రయాణంకట్టాడు.

౬

తిరిగీ మూడేళ్లవరకూ వెంకట్రావుజీవితం సాఫీగా సాగిపోయింది. మోటుతనమూ, నిరాశా అతనిలో పాతుకుపోయినై. చూపు సరీగ్గా ఆనటంలేదు. ఆరోగ్యం క్షీణించటం మొదలెట్టింది. జ్ఞాపకశక్తి తగ్గిపోయింది. ఆఫీసులో డవాల్ బంట్రోతుమీదా, యింట్లో కన్నయ్యమీదా విసుక్కోవటం, గొణుగుకోవటం ప్రారంభించాడు. ఆఫీసునుంచి వస్తో, ఏదో చూసి ఆలాగే నిలబడిపోయేవాడు.

ఒక కంట్రాక్టులో ప్రభుత్వానికి యాభైవేలు నష్టం వచ్చింది. కంట్రాక్టర్లు రావుకళ్లల్లో సుమ్మపోసి, సొమ్ము అంతా సుంజుకొని, తిరిగీ రావుమీదే కేసు పెట్టారు. రావు ప్లీడరునేనా పెట్టుకోలేదు. ప్రభుత్వం రావుని డిస్మిస్ చేసింది. పదివేలరూపాయలు రావు కాజేశాడని, అందుకుగాను అతనికున్న యిరవై ఎకరాల భూమిలో పదిఎకరాలు ప్రభుత్వం స్వాధీనపరచుకొంది. వెంకట్రావు ఏమీ బాధపడలేదు. కన్నయ్యమాత్రం మానేశాడు, జీతం తగ్గించారనే నెపంమీద.

వెంకట్రావు పదిఎకరాలూ అమ్మేశాడు, ఎనిమిది వేల రూపాయలికి. రెండువేలుపెట్టి ఒక పెంకుటిల్లు కొన్నాడు ఒకగ్రామంలో. ఒకకొత్తనౌకరుని పెట్టుకొన్నాడు. 'ఇంత యిల్లెందుకు' అనుకునేవాడు. నౌకరుతో 'నా యిల్లుకదరా !' అనేవాడు. ఒకబక్కపిల్లిని చేరదీసి దాన్ని పెంచమని నౌకరుకు ఆర్డరిచ్చాడు. కాగితాలు చిరిగిపోయిన భాగవతపుస్తకం తీసి ఆనందభైరవిరాగంలో చదివేవాడు.

వెంకట్రావుకి గుండెజబ్బుచేసింది. డాక్టర్లు మద్రాసు వెళ్లమన్నారు. పదిహేనువందల రూపాయలు ఖర్చుపెట్టి మద్రాసులో ఒకఏడాది ఉండి జబ్బు నయం చేసుకొన్నాడు. మద్రాసునుంచి వస్తోంటే ఒకదిక్కులేని పన్నెండేళ్లపిల్లను తనతో తీసుకువచ్చాడు. ఆమెకి 'సుందరమ్మ' అని నామకరణం చేశాడు. ఒకగురువుని నియోగించి సంగీతం చెప్పించేవాడు. ఆమె 'తాతయ్యా' అని పిలుస్తోండేది రావుని.

రోజూ సాయంత్రం మాలగూడెం వెళ్లేవాడు. ఆపూటకు తిండిలేనివాళ్లకి పావలా అర్ధా యిచ్చేవాడు. పొరుగింటి లచ్చన్నగారితో తన యింజనీరు గొడవలు చెప్తూండేవాడు. ఇలా రెండేళ్లు గడిచాయి అతనికి బ్యాంకులో రెండువేలుమాత్రం మిగిలినై.

ఒక పట్టభద్రుణ్ణి వెదకి తీసుకువచ్చి, సుందరమ్మకి పెళ్లిచేశాడు. వెయ్యిరూపాయలుకట్నం, అయిదువందలు ఖర్చులు చేశాడు. కన్నీళ్లతో సుందరమ్మని అత్తవారింటికి పంపించాడు. "మాతో వచ్చెయ్యి తాతయ్యా" అని ఏడ్చింది. "ఇప్పుడు కాదు, ముందు వస్తానమ్మా" అన్నాడు. జీవితంలో ఒక అనాథ బాలిక నుద్ధరించానుగదా అని సంతృప్తిపడ్డాడు.

క్రమంగా అతని నిల్వసొమ్ము ఖర్చు అయిపోయింది. "చేతుల్లో శక్తివున్నంతవరకూ సుందరమ్మ యింటికి వెళ్లి వాళ్లను బాధించను" అనుకొన్నాడు. ఒకబియ్యపుకొట్టులో గుమస్తాగా కుదిరాడు, యిరవై రూపాయల జీతానికి.

వెంకట్రావు శక్తిహీనుడైపోయాడు. గడ్డం బాగా పెరిగింది. దగ్గు తిరిగీ వస్తోంది, మనిషి వంగిపోయాడు. మాలపల్లెలో పిల్లలు హాస్యంచేసేవారు. కాని నవ్వలేకపోయేవాడు రావు.

మిట్టమధ్యాహ్నం. అందులో వేసవికాలం. యజమానిఆజ్ఞప్రకారం, వెంకట్రావుఆయాసపడుతో, మూడుమైళ్లదూరంలో ఉన్న పొరుగూరు వెళ్లుతున్నాడు. అతనిపాదాలూ, తలా మాడిపోతున్నై. తన పూర్వజీవితాన్ని తల్చుకొన్నాడు. ఎండిపోయిన గుండెలో ఏమూల ఒక నీటిచుక్క ఉందో, అది కళ్లలోంచి పెగుల్చుకు వచ్చింది.

తిన్నగా పొరుగుగ్రామానికి వెళ్లి, ఒకకొలనిలో నీళ్లు తాగి, ఒకయింటిఅరుగుమీద కూర్చొన్నాడు విశ్రాంతికోసం. నాలుగయిదేళ్లపిల్లాడు 'బూచాడు' అంటూ యింట్లోకి వెళ్లి ఏడవటం మొదలెట్టాడు. ఒక ముప్ఫైఆరేళ్లస్త్రీ గుమ్మంనుంచి తొంగి చూసి "ఎవరు తాతా, ఏవూరుమీది" అంది. వెంకట్రావు వనుకుపాట్లు పడుతో 'పక్కవూరే' అన్నాడు.

"ఏమైనా పిల్లలూ,మనుమలూనా తాతగారూ" అంది ఆవిడ, గుమ్మందగ్గర అరచాటుగా నించొని. ఇంతలోక్కీ, ఆ అయిదేళ్లపిల్లాడువచ్చి 'తాతయ్యా'అంటూ వొళ్లో కూర్చున్నాడు.

"నీపేరేమిటి" అన్నాడు వెంకట్రావు.

"వెంకట్రావు" అన్నాడు ఆ పిల్లాడు.

"నా పేరూ వెంకట్రావే" అన్నాడు రావు.

"అందుకే తాతయ్యావ్" అన్నాడు ఆపిల్లాడు.

ఆపిల్లాడు పేర్లు చెపుతున్నాడు: "ఆడిపేరు రామం, ఆడిపేరు లచ్చీమినారాయణ."

"నీనాన్న హితుల పేర్లా?" అన్నాడు వెంకట్రావు.

"ఊఁ! అమ్మపేరు నిర్మల, అమ్మమ్మపేరు లచిమమ్మ..." అన్నాడు పిల్లవాడు.

వెంకట్రావుగుండెలో శతఘ్ని పేలినట్లయింది. తల పైకెత్తి చూశాడు గుమ్మందగ్గరఉన్న స్త్రీని. చిక్కిపోయిన చెక్కిళ్లూ, ఊడిపోయినజుట్టూ, మాసిన బట్టలూ — యీమె నిర్మల, నిర్మలేనా? ఆమె ఏదో చెపుతోంది. "ఆయన పోయారు తాతగారూ, మా అమ్మ రాసిచ్చిన పదిఎకరాలమీద బ్రతుకుతున్నామండి. కష్టాలు వచ్చాక మన మేంచేస్తాం తాతగారూ!"

వెంకట్రావు వినిపించుకోలేదు. ఆత్రుతతో "కుటుంబయ్యగారు ఏమవుతారమ్మా" అని అడిగాడు.

"మామయ్య అవుతాడు, మీరెలా ఎరుగుదురు? అయితే యింజనీరు వెంకట్రావుని ఎరుగుదురా తాతగారూ!" అంది ఆవిడ. ఒకనాటి ప్రియురాలు తన్ని 'తాతగారు' అని పిల్చింది. భూమి గిర్రున తిరిగినట్టయింది. జారిపోయేగుండెను ఒకచేత్తో పట్టుకొని, ఒక చేత్తో మొహం కప్పుకొని అక్కడనుంచి తిన్నగా యింటివైపు వెళ్లిపోయాడు. ఈహఠాత్ ప్రవర్తనకి ఆశ్చర్యపడింది నిర్మల. 'పిచ్చాడు తాతయ్యా' అన్నాడు ఆపిల్లవాడు.

వెంకట్రావు యింట్లో మంచంమీద కూలబడ్డాడు. ఇల్లుఅంతా నిశ్శబ్దంగా ఉంది. పిల్లి 'మ్యావు' అంటోంది. సూర్యుడూ, చంద్రుడూ, చుక్కలూ భూమిమీద ఒక్కసారిగా రాలినై. నల్లని సముద్రపుచీకటికెరటాలు జీవితపు గట్టుల్ని ఒరసికొన్నాయి.

అతనిలో ఉత్సాహమూ, ఆనందమూ నాశనమయిపోయాయి. అతనికళ్లు, ఏదో పోగొట్టుకొన్నట్టు బీదగా చూస్తోంటాయి. వర్షాకాలంలో బోదురుకప్పల బెకబెకలూ, వసంతంలో కోకిలకూజితాలూ అతనికి ఒకటే! రాత్రిళ్లు నక్షత్రాలు కనపడితే, ఉదయం దీపాలు అక్కర్లేకుండా వెల్తురు వస్తుంది. ఆకలికి అన్నం తింటారు, తినటంమూలాన్ని పెరుగుతారు, యవ్వనంలో కామిస్తారు, వృద్ధాప్యంలో-చచ్చిపోయే రోజులు సమీపించినకొలదీ, చాలాకాలం బ్రతుకుతామనే ఆశతో జీవిస్తారు. శ్రావ్యంగా పాడేవాడికీ, పాటరానివాడికీ ఒకటే హృదయం ఉంది. "నీకంటె నేను గొప్పవాడ్ని" అంటానికి ఎవరికీ హక్కులేదు. ఒకరికి కవిత్వం రాయటంలో, ప్రకృతిని ఆనందించటంలో శక్తి ఉంటుంది, మరొకరికి హృదయాన్ని కరడుకట్టించుకొని, చీకట్లని వెదజల్లేశక్తి ఉంటుంది. తోచక దెబ్బలాడుతారు. తెలివితేటలెక్కువై, ప్రభుత్వాలూ, యుద్ధాలూ, విప్లవాలూ, కోర్టులూ కల్పించుకుంటారు. జీవితంలో నగ్నసత్యం తెలుసుకొని, నవలలూ, సినీమాలూ, రోమాన్సులూ చూసి ఆనందిస్తారు. చివరికి ప్రతీజీవితం ప్రత్యేకజీవితం. ఒకరికీ ఒకరికీ సంబంధం లేదు. ఆశకు అంతులేదు. అంతానికి ఆశ కారణం. ఇది ప్రపంచం, ఇది జీవితం.